
ఆంధ్రజ్యోతి



సోమశిలలో 12.266 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 17: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి జలాశయంలో 12.266 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,600, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 370 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



• దినేష్‌కు బాబు బుజ్జగింపు



చంద్రబాబును కలిసిన దినేష్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీపీఆర్, నారాయణ, బీద తదితరులు

ఎమ్మెల్సీ ఇస్తానని హామీ • ప్రభుత్వం రాగానే కార్పొరేషన్ పదవి

ప్రశాంతిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని మాటిచ్చిన తండ్రికొడుకులు

నెల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోవూరు టీడీపీలో నెలకొన్న సంక్షోభం సమసిపోయింది. టికెట్ ఇవ్వకపోవడంతో తీవ్ర వేదనకు గురై పార్టీకి దూరంగా ఉన్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో బీద రవిచంద్ర, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డిలు గత మూడు రోజులుగా జరిపిన చర్చలు ఫలించాయి. ఆదివారం రాత్రి ప్రధాని మోదీ సభ అనంతరం చంద్రబాబు నివాసంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ, బీద రవిచంద్రలు సమావేశం అయ్యారు. దినేష్‌రెడ్డి భవిష్యత్తు బాధ్యత నాది.. అంటూ చంద్రబాబు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి భరోసా ఇచ్చారు. టీడీపీ కుటుంబానికి తండ్రి, కొడుకులు చేసిన సేవను పార్టీ ఎప్పటికి మరిచిపోదని, సముచిత స్థానంతో గౌరవిస్తుందని చంద్రబాబు అన్నారు. 2027లో దినేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తామని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని అధినేత హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన తండ్రి, తనయులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకువస్తామని చంద్రబాబుకు మాట ఇచ్చారు. దీంతో కోవూరులో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

• నిఘా నేత్రాలు నిస్తేజం



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణ హెడ్ క్వార్టర్‌లో నేరాలను అరికట్టడానికి ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు నేల చూపులు చూస్తున్నాయి. గతంలో పట్టణంలోని గేట్ సెంటర్ కూడలి, పంచాయతీ బస్టాండు, సంగం రోడ్డు కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని పోలీస్‌స్టేషన్‌కి అనుసంధానం చేశారు. అయితే ఆ సీసీ కెమెరాల్లో కొన్ని అసలు పనిచేయడం లేదు. మరి కొన్ని సక్రమగా పనిచేయడంలేదు. ఇప్పటికైనా సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- పొదలకూరు

• ముసుగు పడింది!

కోడ్ అమలులోకి రావడంతో జిల్లాలోని రాజకీయ నేతల విగ్రహాలకు రెవెన్యూ సిబ్బంది ముసుగులు తొడిగారు. సంగం మండలంలోని వైఎస్ఆర్, గౌతమ్‌రెడ్డి విగ్రహాలకు ముసుగులు వేశారు. సచివాలయాల్లో ఉన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోపై పేపరు అంటించారు.



- సంగం

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

• 60శాతం మంది విద్యార్థుల హాజరు • జాయింట్ కలెక్టర్ పరిశీలన

నెల్లూరు (విద్య), మార్చి 17: జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధి కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటైన పరీక్ష కేంద్రాలను ఆదివారం ఉదయం జేసీ, ఏపీ పీఎస్‌సీ సెక్షన్ అధికారులు ఆరోగ్య రాణి, సునీత కలిసి పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యా ర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టడంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. 13 మంది సీనియర్ అధికారులను లైజనింగ్ అధికారులుగా నియమించామన్నారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 6,955 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,236 మంది హాజరయ్యారని, 2,719 మంది గైర్హాజరు కాగా 60.91 శాతం హాజరుశాతం నమోదైందన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6,955 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,196 మంది హాజరు అయ్యారని 2,759 మంది గైర్హాజరయ్యారవడంతో 60.33 శాతం హాజరు నమోదైందన్నారు.



కనుపర్తిపాడులోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్ తదితరులు



నెల్లూరు : వీఆర్ పీజీ సెంటర్‌లో పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

• పటిష్ట బందోబస్తు

నెల్లూరు(క్రైం) : జిల్లాలో గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య నెల్లూరు వీఆర్ పీజీ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తగిన బందోబస్తు ఏరాట్లు చేశామన్నారు.

'టెన్'షన్ వద్దు !

- ప్రశాంతంగా పరీక్షలు రాయండి
- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు
- జిల్లాలో 176 కేంద్రాల్లో నిర్వహణ
- సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాట్లు
- హాజరుకానున్న 32,746 మంది విద్యార్థులు

నెల్లూరు (విద్య), మార్చి 17: పదోతరగతి పరీక్షలు సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను విద్యాశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు నేలపరీక్ష తప్పే లా చర్యలు చేపట్టారు. అలాగే మాల్‌ప్రాక్టీస్ నిరోధానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో ప్రశ్నపత్రంపై కోడ్ అమలు చేస్తున్నారు. దీనివల్ల ప్రశ్నపత్రం లీక్ కావడం వంటి సంఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. పరీక్ష సమ యంలో విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను అందచేస్తారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.245 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నారు. గంటముందే విద్యార్థులు పరీక్ష కేం ద్రానికి చేరుకోవాలి. అత్యవసర పరిస్థితి, ఇతర అనారోగ్య కారణాలే మేనా ఉంటే 5 నుంచి 10 నిమిషాలపాటు వెసులుబాటు కల్పిస్తారు.

• అర్ధగంట ముందే ప్రశ్నపత్రం

పదోతరగతి ప్రశ్నపత్రాలను ఇప్పటికే జిల్లాలోని 48 పోలీస్‌స్టేషన్ లలో భద్రపరచగా, పరీక్షకు 30 నిమిషాల ముందు మాత్రమే వాటి ని ఆయా మండల కేంద్రాల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలిస్తారు. పరీక్ష రాసే సమయంలో విద్యుత్ అసౌకర్యం కలగకుండా చూస్తు న్నామని అధికారులు తెలిపారు. అలాగే తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు ఏఎన్ఎంలు కూడా మెడికల్ కిట్‌లతో అందుబాటు లో ఉంటాయి. పరీక్షకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టికెట్ చూపితే ఉచితంగా ప్రయాణించవచ్చు.

• 32,746 మంది హాజరు...

జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 16,709 మంది బాలురు, 15,987 మంది బాలికలు కలిపి మొత్తం 32,746 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. మొత్తం 176 పరీక్ష కేంద్రాల్లో ఏడు కేంద్రాలను సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించారు. వాటిల్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యా ర్థులకు జంబ్లింగ్ విధానంలో పరీక్షలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.



పదోతరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం

• హాల్‌టికెట్స్ ఇవ్వకుంటే చర్యలు...

విద్యార్థులు ఫీజులు చెల్లిం చలేదని, మరే ఇతర కారణా లతో హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడితే సంబం ధిత పాఠశాలలపై చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో విద్యార్థులే నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా కల్పించిందన్నారు.



మనుబోలు హైస్కూల్‌లో రూము నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

• కాల్ సెంటర్ ఏర్పాటు

ఏవైనా సమస్యలు తమకు తెలియచేసేందుకు కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి సమస్యలను తెలియచేసేందుకు 8341408109 నెంబరును సంప్రదించాలన్నారు.

• పాఠశాలలకు సెలవు

పదోతరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లోని ఇతర తరగతులకు సెలవు ప్రకటించారు. కొన్ని కేంద్రాల్లో ఉదయం రెగ్యులర్ పదోతరగతికి, మధ్యాహ్నం ఓపెన్‌స్కూల్ సొసైటీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఇతర తరగతుల వారికి సెలవులు ఉంటాయి.

• పరీక్షలకు 'టెన్' షన్ పడొద్దు

పరీక్షలను విద్యార్థులు పండుగలా జరుపుకోవాలి. ఏడాదంతా కష్టపడి చది విన చదువుకు పరీక్షల రోజునే విద్యార్థికి మార్కుల రూపంలో గుర్తింపు లభిస్తుంది. కాబట్టి ప్రశాంతవాతావరణంలో పరీక్ష రాయాలి.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

జిల్లాలో ఈనెల 18వతేదీ నుంచే ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలను కూడా నిర్వహిస్తున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. పదోతరగతికి 11 సెంటర్‌లు, ఇంటర్‌కు 19 సెంటర్‌లు కలిపి మొత్తం 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఆయా పరీక్ష కేంద్రా ల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలకు మొత్తం టెన్త్‌కు 1,713 మంది, ఇంటర్‌కు 3,591 మంది కలిపి మొత్తం 5,304 మంది హాజరవుతున్నారని తెలిపారు.

ప్రజాగళంతో
జగన్‌కు వణుకు

- ఉమ్మడి జిల్లాలో పదికి పది గెలుస్తాం...
- నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి నారాయణ



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న నారాయణ, కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (వైద్యం)మార్చి 17: తెలుగుదేశం, బీజేపీ, జనసేనల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వణుకు మొదల యిందని నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నెల్లూరు నుంచి ప్రజాగళం సభకు వెళ్లే బస్సులకు ఆయన ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలనలో ప్రజలు విసిగి పోయారన్నారు. చిలకలూరి పేట బహిరంగ సభకు వేలాదిమంది తరలివచ్చారని తెలి పారు. ఒకప్పుడు బస్సులు పెడుతున్నాం.. రమ్మని పిలిస్తే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలే స్వచ్ఛందంగా వస్తున్నారని ఆయన వివరించారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి నెల్లూరులో పదికి పది స్థానాలు గెలుస్తామని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రజాదరణ చూస్తుంటే టీడీపీ పట్ల, నారాయణ పట్ల ఎంత అభిమానం ఉందో తెలుస్తున్నదన్నారు. టీడీపీ నెల్లూరు నగరాధ్యక్షుడు మామిడాల మధు తదితరులు మాట్లాడారు.

నేటి నుంచే ఒంటిపూట బడులు

- చెట్ల కింద తరగతులు నిర్వహిస్తే చర్యలు
- మధ్యాహ్న భోజనం తరువాతే విద్యార్థులు ఇంటికి..

నెల్లూరు (విద్య), మార్చి 17: మార్చి మూడోవారంలోనే ఎండలు మండుతున్నాయి. ఏవైనా పనులుంటే అందరూ కూడా ఉదయాన్నే చక్కబెట్టుకుంటున్నారు. తరగతి గదిలో కూర్చున్నా విపరీతమైన ఉక్కపోత. ఈ క్రమంలో విద్యాశాఖ ఒంటిపూట బడులను ప్రకటించింది. ఈనెల 18వతేదీ (సోమవారం)నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో పీజేవీ.రామారావు తెలిపారు. ఆదివారం జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు.

• ఎండల తీవ్రత ఎక్కువ

ఎండల తీవ్రత ఈ ఏడాది ముందుగానే మొదలైంది. పది రోజులుగా భారీ ఉష్ణోగ్ర తలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒంటిపూట బడులను ప్రకటించింది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న తరుణంలో ఒకటి నుంచి 9వతరగతి వరకు అన్ని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించా లని ఆదేశాలను జారీ చేశారు.

• సూచనలు పాటించండి !

అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలకు విద్యా శాఖ పలు సూచనలు జారీ చేసినట్లు డీఈవో తెలిపారు. ఏప్రిల్‌లో రెండో శనివారాన్ని పని దినంగా పరిగణించాలన్నారు. గ్రామ పంచాయితీ, ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖల సహకారంతో అన్ని పాఠశాలల్లో తగిన నీటివసతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు శుద్ధి యంత్రాలను సిద్ధ చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లోనూ, చెట్లకింద తరగతులు నిర్వహిం చకూడదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలని, భోజనం అందించాకే విద్యార్థులను ఇళ్లకు పంపించాల న్నారు. ఎవరైనా వేసవి తాపానికి గురైతే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య పరీక్షలు చేపట్టడంతో పాటు పాఠశాల పరిసరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు వీటిపై దృష్టి సారించి కచ్చితంగా అమలు చేయాలన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.25

సహరి (మంగళవారం) : 4.53

ప్రసన్నుడి రథం ట్రయిల్ రన్
విజయవంతం



బిట్రగుంట, మార్చి 17: బోగోలు మండలం కొండబిట్రగుంటలో ఆదివారం శ్రీవారి రథం ట్రయిల్ రన్ విజయవంతంగా పూర్తయింది. ముందుగా యాగ్నికులు రథానికి మహాసంప్రోక్షణ, శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ అర్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. స్వామివారి ఉత్తర ద్వారం దిగువ మెట్ల వద్ద ఉన్న ప్రధాన మండపంలో విశ్వక్సేన, కలశ పూజలు, దోషపరిహార శాంతిహోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ఉత్సవ మూర్తులను మండపానికి చేర్చి పూజలు చేశారు. ఆలయ ఈవో ఏ రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి దంపతులు ఈ కార్యక్రమాన్ని జరిపించారు.

• రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కొండ బిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల25 తేదీ వరకు నిర్వహించనున్నారు. 19న ఉద యం గిరిప్రదక్షిణ ఉత్సవం, రాత్రి అంకురార్పణ. 20న ధ్వజారోహణం, కొడిముద్దలు, శేషవాహనసేవ జరుగుతాయి. 21న హనుమంతసేవ, 22న గరుడసేవ, 23న తెప్పోత్సవం, గజవాహనసేవ. 24న కల్యాణం, రథోత్సవం, సా యంత్రం చక్రస్నానం, రాత్రి అలకల తోపు, అశ్వవాహనసేవ, ధ్వజఅవరోహణం. 25న పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించనున్నారు.

వారి ఆశలు.. వీరి ఆడంబరాలు !

బుచ్చి మంగలికట్ట లేఅవుట్‌లో నాసిరకంగా నిర్మించిన జగనన్న ఇళ్లు



- పేదల ఇళ్ల నిర్మాణాల్లో భారీ అవినీతి
- నిర్మించకనే నగదు తీసేసుకున్న కాంట్రాక్టర్లు
- గిరిజనుల సొమ్ముతో పలువురు పరారీ
- పూర్తయింది 8805 ఇళ్లు.. చెల్లించింది రూ.478 కోట్లు

నెల్లూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు సొంతిళ్ల సంగతి దేవుడెరుగు... ఆ గృహాల మాటున కొందరు పెద్దలకు మాత్రం కాసులు కురుస్తున్నాయి. సొంత ఇళ్లు కట్టిస్తే తమ కష్టాలు తప్పుతాయని పేదలు నాలుగేళ్లుగా ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. కానీ వీరి ఆశలను మాత్రం క్యాష్‌గా మార్చుకొని కొందరు విలాసంగా జీవిస్తున్నారు. ఎంతలా అంటే కొందరు కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు భారీ భవంతులు నిర్మించుకునేలా.. విలాసవంతమైన కార్లు కొనుక్కునేలా..మరీ ముఖ్యంగా ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టరు దర్జాను చూసి పేదలే కాదు అధికారులు, రాజకీయ నాయకులు కూడా నివ్వెరపోతున్నారు. నెల్లూరే కాదు తిరుపతి జిల్లాలోనూ నాలుగో వంతు ఇళ్ల నిర్మాణాన్ని ఈ ఒక్క కాంట్రాక్టరే తీసుకున్నారు. పూర్తి చేసిన ఇళ్లకు, ఈ కాంట్రాక్టరుకు చెల్లించిన డబ్బులను పోలిక చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే.! ఇలాంటి వారే మరో ఇద్దరు కాంట్రాక్టర్లు కూడా ఉండడం గమనార్హం. పేదల డబ్బులతో సొంత గూడు నిర్మించాల్సిన వారు ఆ డబ్బులతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుం డడం జగనన్న ఇళ్లు పథకంలో అవినీతి స్థాయిని తెలియజేస్తోంది.

• జగనన్న ఇళ్ల నిర్మాణంలో అవినీతి

సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించకుండానే నిర్మించినట్లుగా బిల్లులు చేసుకొని తినేయడం ఒక పెద్ద కుంభకోణం అయితే, జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లలో అంతకుమించి అవినీతి జరుగుతున్నట్లు అక్కడ పరిస్థితులను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. జగనన్న లేఅవుట్లలో మొత్తంగా 63,135 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిర్మాణాలు ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు కావస్తోంది. ఇప్పటికి పూర్తయింది 8805 ఇళ్లు మాత్రమే..!. 923 ఇళ్లు అసలు ప్రారంభమే కాలేదు. మరో 22,278 ఇళ్లకు బేసుమట్టం కూడా వేయలేదు. 17,587 ఇళ్లు బేస్ స్థాయిలో ఉండగా 4508 ఇళ్లు రూఫ్ లెవల్, 9034 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ దశలో ఉన్నాయి. వీటికి గానూ ఇప్పటివరకు చెల్లించింది అక్షరాలా రూ.478.29 కోట్లు..! లేఅవుట్లలో సొంతంగా నిర్మించుకునేవారు ఉండగా, ఆప్షన్-3 కింద ప్రభుత్వమే కొందరు కాంట్రాక్టర్ల చేత నిర్మాణాలు చేయిస్తోంది. జిల్లాలో కాంట్రాక్టర్లకు 29,289 ఇళ్లను అప్ప గించారు. అందులో 30 ఇళ్లు అసలు ప్రారంభమే కాకపోగా మరో 2297 ఇళ్లు పునాది గుంతల దశ దాటలేదు. ఇంకో 10,750 ఇళ్లు బేస్ స్థాయిలోనే ఉన్నాయి. 606 ఇళ్లు లింటెల్ లెవల్, 2929 ఇళ్లు రూఫ్ లెవల్, 7548 ఇళ్లు రూఫ్ కాంక్రీట్ స్థాయిలో ఉన్నాయి. మొత్తంగా కాంట్రాక్టర్లు నాలుగేళ్లలో పూర్తి చేసింది 5063 ఇళ్లు మాత్రమే. ఇప్పటి వరకూ చెల్లించిన రూ.478.29 కోట్లలో కాంట్రాక్టర్లకు చెల్లించిన మొత్తమే సింహభాగం ఉంది.

• కాంట్రాక్టర్లకు బాధ్యతేది..?

ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను మంజూరు చేస్తోంది. ఆ డబ్బులతో ఇంటిని నిర్మించడం సాధ్యం కాదని చెబుతూ కాంట్రాక్టర్లు లబ్ధిదారుల నుంచి అదనంగా వసూలు చేశారు. గిరిజనులకు ప్రభుత్వం అదనంగా మరో రూ.15 వేలు సాయం చేస్తుండగా దానిని కూడా కాంట్రాక్టర్లు తీసేసుకున్నారు. డీఆర్డీఏ ద్వారా రూ.30 వేలను ఇంటికి రుణంగా మంజూరు చేయగా ఆ మొత్తాన్ని కూడా తీసుకున్న కాంట్రాక్టర్లు ఇళ్లను మాత్రం నిర్మించి ఇవ్వలేదు. చాలా చోట్ల నిరుపేదల డబ్బులు తీసుకొని కాంట్రాక్టర్లు పత్తా లేకుండా పోయారు. ఇటీవల పలు చోట్ల గిరిజనులు ఆందోళన చేస్తుండడమే ఇందు కు నిదర్శనం. అసలు కాంట్రాక్టర్లకు ఇంటి నిర్మాణ బాధ్యతలను అప్పగించే క్రమంలోనే ఒక నిబంధన అంటూ పాటించలేదన్న విమర్శలున్నాయి. సాధారణంగా టెండర్లు పిలిచి వర్క్ అప్పగిస్తే ఆ కాంట్రాక్టర్ తప్పుచేసినా బ్యాం కు గ్యారెంటీని సీజ్ చేసేందుకు అవకాశముం టుంది. కానీ పేదల ఇళ్ల నిర్మాణాలను అధికారులు ఇష్టమొచ్చినట్లు ఎవరెవరికో అప్పగించారు. కనీసం క్వాలిటీ కంట్రోల్ లేకుండా వారికి రూ.కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారు. దీనిపై విచారణ జరిపి అది నిజమని తేలితే సదరు కాంట్రాక్టర్లన ఉంచి పేదల సొమ్మును ఎలా రికవరీ చేయాలి.. అంటే ఎవరి దగ్గరా సమాధానం లేదు. పేదల ఇళ్ల నిర్మా ణాల్లో అవినీతిపై గతంలోనే ఆధారాలతో సహా ఫిర్యాదులు అందడంతో ఏడాది క్రితం జిల్లా కలె క్టర్.. జాయింట్ కలెక్టర్‌ను విచారణకు ఆదేశించారు. కానీ ఆ విచారణ ఏమైందో కూడా తెలియదు.

పేదల సొమ్ముతో విలాసాలు

జిల్లాలో 180 మంది కాంట్రాక్టర్లకు అధికారులు ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. మెజారిటీ ఇళ్లను ముగ్గురు, నలుగురు మాత్రమే తీసుకున్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టరు ఒక్కరే మూడు పేర్లతో 7680 ఇళ్లను తీసుకున్నారు. ఆయన ఇప్పుడు వరకు పూర్తి చేసింది 1080 ఇళ్లు మాత్రమే. కానీ ఆ కాంట్రాక్టరు చెల్లించిన మొత్తం రూ.115 కోట్లుగా ఉంది. ఈ కాంట్రాక్టరు తిరుపతి జిల్లాలోనూ 5227 ఇళ్లను తీసుకోగా ఇప్పటికి 64 ఇళ్లు పూర్తి చేశారు. అక్కడ రూ.56.49 కోట్లు చెల్లింపులు చేశారు. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖలో ఈ కాంట్రాక్టరు హవా కొనసాగుతున్నట్లు అక్కడి సిబ్బంది చెప్పుకుంటు న్నారు. ఆ శాఖలో పనిచేస్తున్న ఓ కంప్యూటరు ఆపరేటరే ఈ కాంట్రాక్టరు వద్ద కూడా పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ కంప్యూటరు ఆపరేటర్ ద్వారా పనులు చేయకుండానే లెక్కకు మించి బిల్లులు పెడుతూ ప్రజాధనాన్ని లాగేసుకుంటున్నారని ఆ శాఖలో చర్చించుకంటున్నారు. అలానే జిల్లాలో మరో కాంట్రాక్టరు 1944 ఇళ్లు తీసుకోగా ఇప్పటికి 108 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. సదరు కాంట్రాక్టరుకు రూ.19 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. ఈ కాంట్రాక్టరు ఇళ్లు నిర్మించకుండా తప్పించుకొని తిరుగుతున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. ఇళ్లు నిర్మిస్తున్న 180 మంది కాంట్రాక్టర్లలో మెజారిటీ కాంట్రాక్టర్లు ఒక్క ఇల్లు కూడా పూర్తి చేయలేదు. కానీ వారికి రూ.లక్షల్లోనే బిల్లులు చెల్లించడం గమనార్హం. ఈ కాంట్రాక్టర్ల సాయంతో గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు విలాసవంతమైన ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు సమాచారం.


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు పోటెత్తిన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు

ప్రజాగళం.. ప్రభంజనం

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..




జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం...

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సంగం, మార్చి 17: మండలంలోని ముంబాయి జాతీయ రహదారి కొరిమెర్ల పంపింగ్ స్కీమ్‌కు వెళ్లే దారికి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు పక్కన ముళ్ల కంపల్లో గాయాలతో ఉన్న మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంగం ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు శరీరంపై ఉన్న దుస్తులను బట్టి మతిస్థిమితం లేని అనాథగా గుర్తించారు. కాళ్ల శరీరంపై రక్త గాయాలను గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమర్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


సంఘటన స్థలంలో విచారిస్తున్న పోలీసులు

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

● 30 మొబైల్స్, యాక్ససరీస్ అపహరణ

కావలిరూరల్, మార్చి 17: కావలి పట్టణం తుమ్మల పెంట రోడ్‌లోని శ్రీనివాస సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు, 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు సెల్‌ఫోన్ దుకాణం షర్టర్ తాళాలు పగులగొట్టి షాపులోకి ప్రవేశించి సుమారు రూ.5 లక్షల విలువచేసే 30 స్మార్ట్‌ఫోన్లు, యాక్ససిరీస్‌తో పాటు రూ.3000 అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు దుకాణం యజమానికి సమాచారం ఇచ్చారు. బాధితుడి బాలక్రిష్ణ ఫిర్యాదుతో సంఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఐ రాజేష్ సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఈ చోరీలో ముగ్గురు పాల్గొన్నట్లు గుర్తించి నెల్లూరు క్లూస్ టీం సభ్యులతో వేలిముద్రలు స్వీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సీసీ టీవీ ఫుటేజ్‌లో చోరీ చేసిన వ్యక్తులు

రెండు ఆలయాల్లో...

మనుబోలు, మార్చి 17: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెండు ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని భావనారుషి, రామమందిరం ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్ప డ్డారు. ఆది వారం ఆల యం తలు పులు తీసి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసు లకు సమాచారం అందించారు. బావనారుషి ఆలయం లో అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలకు ఉన్న రెండు మంగళసూత్రాలు, రామమందిరంలోని సీతమ్మ మెడలో ఉన్న రెండు మంగళసూత్రాలను చోరులు అపహరించుకు వెళ్ళారు. దీంతో పాటు భావనరుషి ఆలయంలో హుండీని పట్టు కెళ్ళారని గ్రామస్థులు తెలిపారు. నాలుగు బంగారు మంగళసూత్రాలు దాదాపు రెండు సవర్ల వరకు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండు ఆలయాలలో చోరీలపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రామాలయం తలుపు గొళ్లెం గులగొట్టిన దొంగలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	118
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6247
వెండి కిలో ధర	రూ. 76,700
వెండి ఒక గ్రాము	రూ. 78.70

కొండ బిట్రగుంటకు ప్రత్యేక బస్సులు

కావలి : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు కావలి డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రాహురు శ్రీనివాసులు తెలిపారు. డీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన తెప్పోత్సవం గరుడసేవ, కల్యాణం జరిగే ఈనెల 22,23,24 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు ఈ సర్వీసులన్ని కావలి, అల్లూరు, చెన్నారాయునిపాలెం, శంభునిపాలెం,ఇస్కపల్లి నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి కొండబిట్రగుంటకు నడుపుతామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజరు కేవీఆర్ బాబు, సీనియర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఎం. రామకృష్ణ, డీసీ బ్రహ్మారెడ్డి, రవిప్రకాష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసులు

దువ్వూరు కాలువలో పడి వృద్ధుడి మృతి

సంగం, మార్చి 17: స్థానిక దువ్వూరు కాలువలో పడి సూరాయపాలెం వెంకటేశ్వర్లు (65) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఈయన గతకాలం నుంచి పక్షవాతంతో బాధపడుతున్నాడు. వెంకటేశ్వర్లు ప్రతిరోజు టీ తాగేందుకు బస్టాండుకు వెళతాడు. రోజు మాదిరిగానే ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నమైన ఇంటికి రాలేదు. అతని భార్య బస్టాండ్ అంతా వెతికినా కనిపించలేదు. ఈ క్రమంలో సాయంత్రం దువ్వూరు కాలువలో ఓ మృతదేహం తేలాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని బయటకు తీయగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. బస్టాండ్‌కు వెళ్లిన వెంకటేశ్వర్లు దువ్వూరు కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్న పిట్ట గోడపై కూర్చుంటాడు. ఆ క్రమంలో కూర్చొని ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉంటాడని, ఎవరూ గమనించకపోవడంతో మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతుడికి కుమారుడు ఉంటే ఏడాది కిందట మృతి చెందాడు. వివాహమైన కుమార్తె, భార్య ఉంది.


నీటిలో తేలాడుతున్న మృతదేహం

రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసి మృతి

ప్రత్తిపాడు: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పరిధిలోని నడింపాలెం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, నెల్లూరు జిల్లా కనిగిరి మండలం కృష్ణారెడ్డిపాలెంకి చెందిన షేక్ సుల్తాన్ బాషా (26) ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి కోళ్ల లోడ్‌తో నెల్లూరు వైపు వెళుతుండగా అదే దారిలో తమిళనాడుకు చెందిన లారీ షడన్‌గా ఆపడంతో వెనుక నుంచి వేగంగా వస్తూ ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

కందుకూరులో ముసుగు దొంగల బీభత్సం

కందుకూరు, మార్చి 17: కందుకూరు పట్టణంలో ముసుగు దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. పట్టణ నడిబొడ్డున కనిగిరి రోడ్డులో రిలయన్స్ స్మార్ట్ పక్కనే వ్యాపారి కనమర్లపూడి శివరామకృష్ణ నివాసం ఉంటున్నారు. శనివారం అర్థరాత్రి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో ఇంట్లోని కుటుంబ సభ్యులు ఉక్కపోతకు తలుపులు తీసి బయటకు వచ్చారు. అదే సమయంలో ముసుగులు వేసుకున్న ముగ్గురు దుండగులు మొదటి అంతస్తులో ఉన్న ఇంట్లోకి ప్రవేశించారు. ఒక వ్యక్తి ఇంటి కిందనే ఉండిపోయాడు. వారిని గుర్తించిన శివరామకృష్ణ, అతని భార్య, పిల్లలు ప్రతిఘటించడంతో వారిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడమే గాక మారణాయుధాలు చూపించి బెదిరించారు. దీంతో గాయపడిన బాధిత కుటుంబీకులు భయభ్రాంతులకు గురై మిన్నకుండిపోగా ఇంట్లో నగదు, బంగారం కోసం కప్‌బోర్డులు, బీరువాలు తెరిపించి వెదుకులాడారు. అయితే వారు ఆశించినట్లు పెద్దగా నగదు, బంగారం లభ్యం కాకపోవటంతో పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం కందుకూరు డీఎస్పీ, సీఐలు దోపిడీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితులను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాధితులను విచారిస్తున్న కందుకూరు డీఎస్పీ, సీఐలు

టీ-20 క్రికెట్ లీగ్ విజేత ఎన్‌యూసీసీ

నెల్లూరు (విద్య), మార్చి 17 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రొఫెసర్ టీవీ రమణ మెమోరియల్ జిల్లాస్థాయి టీ-20 క్రికెట్ లీగ్ పోటీల్లో నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్(ఎన్‌యూసీసీ) జట్టు విజేతగా నిలిచింది. బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రికెట్ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఎన్‌యూసీసీ, లార్ఫ్ క్లబ్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన లార్ఫ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్‌యూసీసీ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విజేతలకు ఏసీఏ ఎస్‌జీఎం ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, ఎన్‌డీసీఏ కోశాధికారి అబూబకర్, మాజీ కార్యదర్శి డీ శ్రీనివాసరెడ్డి ట్రోఫీ, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పీ భాను ప్రకాష్‌రెడ్డి, వెంకన్న, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు ఆనంద్ పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

రేపు పెన్షనర్ల సర్వసభ్య సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌లో గల పెన్షన్ భవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎన్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన డీఏ ఉత్తర్వులు, పెన్షనర్స్‌కు సంబంధించిన ఇతర సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. వేసవిలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ ఎంపీ రమణయ్య సూచనలిస్తారని, జిల్లాలోని పెన్షనర్స్ అందరూ హాజరుకావాలని కోరారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది !


ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో నేతల విగ్రహాలకు ముసుగులు


ఉదయగిరిలో సిబ్బందిచే ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఆత్మకూరు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు సెంటర్లతో పాటు మండలంలోని గ్రామాల్లోని ముఖ్యమైన కూడళ్లల్లోని రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వద్ద రాజకీయ నేతల ఫొటోలను తొలిగించారు. వివిధ ప్రాంతాల్లో దర్శనమిస్తున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలిగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘనలు జరగకుండా జాగ్రత్త పడ్డారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో జాతీయ రహదారిపై ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను చేపడతామన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.

ఉదయగిరి: పట్టణంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ పంచాయతీ సిబ్బందితో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు తొలగించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. మండలంలో 17 పంచాయతీల పరిధిలో ఎలాంటి జెండాలు, వాల్ పోస్టర్లు ఉండరాదని ఆయా పంచాయతీల కార్యదర్శులకు సూచించారు.

ప్రజాగళం సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు


కందుకూరు : బస్సుకు జెండా ఊపుతున్న నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 17: తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా చిలకలూరిపేట స మీపంలో నిర్వహించిన ప్రజాగళం సభకు ఆదివారం నియోజకవర్గం నుంచి తెలుగుతమ్ముళ్లు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గం నలుమూలల నుంచి ఏర్పాటు చేసిన బస్సులు, కార్లు, ఇతర వాహనాలలో మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ కమిటీల బాధ్యులతో పాటు యువకులు, మహిళలు అధికసంఖ్యలో తరలివెళ్లడం విశేషం. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

అల్లూరు : అల్లూరు నుంచి టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో ప్రజాగళం సభకు తరలివెళ్లారు. బీద గిరిధర్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, ఎందేటి హరికృష్ణ, రామకృష్ణారెడ్డి, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నజీర్ బాషా, గుంజి రుద్రయ్య, అరగల రమణయ్య, ఆట తిరుమల పాల్గొన్నారు.

లింగసముద్రం: లింగసముద్రం, పెంట్రాల, రాళ్లపాడు, పెదపవని, ముత్యాలపాడు, చినపవని, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, గంగపాలెం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లు ఇతర వాహనాలలో తరలివెళ్లారు. రంగయ్య, అడపా నర్సయ్య, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, మద్దెల రామారావు, జంపాల కృష్ణయ్య, జంపాల శివప్రసాద్, అత్తంటి రంగయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి సుమారు 20 బస్సులు, 10 కార్లలో సుమారు వెయ్యి మందికి పైగానే టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ప్రజాగళం సభకు వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నాయకులు పరిటాల భాస్కర్‌రావు, వలేటి నరసింహం, వలేటి శ్రీధర్‌నాయుడు, కాకుమాని హర్షకుమార్ తరలివెళ్లారు.

బిట్రగుంట: 16పంచాయతీల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు ప్రజాగళం సభకు తరలివెళ్లారు. ఇబ్రహీంపేటలో బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు పార్టీల జెండాలను ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్ ఎస్ యాదవ్, మాజీ అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు, నేతలు కార్యకర్తలు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, వై.వెంకటేశ్వర్లు, పీ.సుబ్బయ్య, ఆదిశేష య్య, హరిబాబు పాల్గొన్నారు.

కలువాయి: ప్రజాగళం సభకు కలువాయి నుంచి వాహనాల్లో తెలుగు తమ్ముళ్లు తరలివె ళ్లా రు. టీడీపీ మండల అధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్య కర్తలు ఉన్నారు.

ఉదయగిరి రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తొలిసారిగా చిలకలూరిపేటలో నిర్వ హించే ప్రజాగళం సభకు నియోజకవర్గ ఉమ్మ డి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేస్ ఆధ్వర్యంలో ఉదయగిరి, దుత్తలూరు మండలాల నుంచి టీడీ పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాల్లో భారీసంఖ్యలో తరలివెళ్లారు. ఆయా మండలాల్లో వాహనాలను టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు.

చేజర్ల: టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. వారి వెంట టీడీపీ మం డల కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి, బీజేపీ జిల్లా బీసీ నాయకులు బత్తుల కిష్టయ్య ఉన్నారు.

సంగం: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆధ్వ ర్యంలో ప్రజాగళం బహిరంగ సభకు సంగం టీడీపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాసులురెడ్డి, దయాకర్, రసూల్, శ్రీనివాసులు, మంజులనాయుడు కారులో బయలుదేరి వెళ్లారు.


సంగం నుంచి బయలుదేరిన టీడీపీ నాయకులు


కలువాయి: ప్రజాగళం సభకు బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు

రేపటినుంచి చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

కలువాయి, మార్చి 17: కుల్లూరులో ఈ నెల 19 నుంచి మొదలుకానున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం కోరారు. 19న అంకురారోపణ, 20న స్వామి వారం కల్యాణం, 21న ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ ట్రస్టు వెలిశెట్టి ప్రభాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్, మార్చి 17: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన కందుల మరియమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆదివారం టీడీపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఎన్.నరసింహా, బీ.నరసింహులు, మట్ల మురళి, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 17: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతర భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



వరికుంటపాడు, మార్చి 17: భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై ఉన్న వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. శిథిలావస్థకు చేరిన వంతెనలో పెచ్చులూడి గుంతలమయంగా మారి కుంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నది. ఇది ఎప్పుడు కూలుతుందో అని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ కొనసాగుతోందని ఈ వంతెనకు ఉన్న రక్షణగోడ సైతం పూర్తిగా దెబ్బతినడంతో ఎక్కడ ప్రమాదాలకు గురి కావాల్సి వస్తుందోనని వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని వెళుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కర్మక్రతువుల అరుగుపై ఆందోళన

సంగం, మార్చి 17: స్థానిక దళివాడకు వెళ్లే మార్గంలో నిర్మించే కర్మక్రతువుల అరుగును కాలనీకి దూరంగా నిర్మించాలని ఆదివారం దళితులు ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన ఓ సామాజికవర్గం ఎప్పటి నుంచో ఇరిగేషన్ సిబ్బంది కోటర్స్‌కు ఎదురుగా ఉన్న పెన్నానది ఒడ్డున కర్మక్రతువులు నిర్వహిస్తున్నారు. అక్కడ అరుగు కూడా ఉండేది. పెన్నా నూతన బ్యారేజీలో పొర్లుకట్టలు వేయడంతో కర్మక్రతువులు నిర్వహించే అరుగు పూడిపోయింది. ఆ అరుగుకు ప్రత్యమ్నాయంగా దానికి సమీపంలో పంచాయతీ ఆధ్వర్యంలో నూతన అరుగు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే ఆ మార్గంలో వెళ్లే దళిత కాల నీవాసులు కర్మక్రతువుల అరుగు నిర్మించవద్దని ఆందోళన చేశారు.


ఆందోళన చేస్తున్న సంగం గ్రామస్థులు

ఆనం సమక్షంలో టీడీపీలో భారీగా చేరికలు


ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన దువ్వూరు ముస్లిం యువకులు

సంగం, మార్చి 17: మర్రిపాడుకు చెందిన మద్దిపాటి హరిరెడ్డి, చేవూరు జనార్ధన్ రెడ్డి ముడి భేమేశ్వరరెడ్డి, కాకు సురేష్, గొల్లపల్లి హజరత్తయ్య పలువురు వైసీపీ కార్యకర్తలు వైసీపీని వీడి ఆదివారం మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికి ఆనం టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి స్వాగతించారు. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. దువ్వూరుకు చెందిన ముస్లిం యువకులు మొఘల్, నాయబ్, హబీబ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం సోదరులు టీడీపీలో చేరారు.

ప్రశాంతతతోనే లక్ష్యసాధన

- సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

ఆత్మకూరు, మార్చి 17: ధ్యానంతో మనిషిలో ప్రశాంతత పెరిగి విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరిగి లక్ష్యసాధనతో ముందుకు వెళతారని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు డాక్టర్ చంద్రా సుబ్రమణ్యం, పవన్‌కుమార్ తెలిపారు. ఆత్మకూరులోని ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న శ్రీషిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ధ్యాన ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జీవిత లక్ష్యాలు, నమ్మకాలు, ఆలోచనలు, సంకల్పాలు తదితర అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వ్యామోహం..మమకారం మనశ్శాంతి లేకుండా చేస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పాత ఆలోచలను, నమ్మకాలను విడిచిపెట్టినపుడే మార్పు సాధ్యపడుతుందన్నారు. బుద్ధభగవానుడి అష్టాంగమార్గం మనశ్శాంతికి, ముక్తికి మంచిమార్గమన్నారు. మనశ్శాంతి పొందాలంటే మనస్సును సాత్వికగుణంలో ఉంచుకోవాలని, అందుకు ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. ధ్యాన సాధకులు సజ్జనసాంగత్యానికి ఆత్మవిజ్ఞాన పుస్తకాలు ఎక్కువగా చదవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమన్నారు. సర్వజీవులను ప్రేమతో, కరుణతో ఆదరించి జీవహింసను రూపుమాపేందుకు ధ్యానసాధకులు కృషి చేయాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


ఉదయగిరిలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

ఉదయగిరి రూరల్: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డిలు కోరారు. ఆదివారం ఉద యగిరి పట్టణ పురవీధులతో పాటు మండలంలోని సంజీవ రాజుపల్లి, చెరువుపల్లి, అయ్యి వారిపల్లి, చెర్లోపల్లి, బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి, పుల్లాయపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని కోరారు. వివాదాలకు పాల్పడినా, ఘర్షణలకు దిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్ఐలు శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేటినుంచి పదో తరగతి పరీక్షలు

ఉదయగిరి, మార్చి 17: స్థానిక ప్రభుత్వ ఉన్నత, సెయింట్‌మేరీ ఇంగ్లీష్ మీడియం, మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించార. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి పొరపాట్లు జరిగినా డిపార్టుమెంట్ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

చేజర్ల: పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వంసిద్ధం చేసినట్లు ఎంఈఓ-2 మస్తానయ్య తెలిపారు. మండలపరిధిలో 460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 180, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 120 మంది, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 120 మంది విద్యార్థులు పరీక్షలు అర్హులన్నారు. అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ఆత్మకూరు: మండలంలో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నజీర్‌బాషా తెలిపారు. సోమవారం నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, సెయింట్ మేరీస్, శ్రీనివాస ఇంగ్లీషుమీడియం హైస్కూళ్లలో, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన 750మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, వైద్యసౌకర్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగుకుండా పరీక్షలు జరిగేలా చూస్తామన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

చివరిసారి పోటీ చేస్తున్నా.. ఆదరించండి : విష్ణు


ఉద్దీపగుంటలో ప్రచారం చేస్తున్న విష్ణు, శివప్రియ

అల్లూరు, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల్లో చివరి సారి పోటీ చేస్తున్నానని.. ఈ ఒక్కసారి ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం అల్లూరు పట్టణ పరిధిలోని ఉద్దీపగుంట, చవటపాలెంలో ఆయన సతీమణి శివప్రియతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలోనే ఉంటూ నేటికీ తనవంతు సహకారాన్ని అందిస్తూనే ఉన్నానని, తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇవే తన చివరి ఎన్నికలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, గుండవరపు సుధాకర్‌రెడ్డి, కత్తుల విజయకుమార్, మిరియాల వెంకటేశ్వర్లు రెడ్డి, విష్ణు అభిమానులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును రాత్రివేళ కరేడులోనే నిలపాలి

ఉలవపాడు, మార్చి 17 : ఆర్టీసీ బస్సును రాత్రి వేళలో కరేడు గ్రామంలోనే నిలపాలని గ్రామస్థులు ఆర్టీసీ అధికారులను కోరారు. నాలుగు రోజులుగా రాత్రి వేళ 8 గంటలు దాటితే సింగరాయకొండ నుంచి కరేడు వచ్చేందుకు బస్సు లేక ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి ఆర్టీసీ లాభనష్టాలతో పనిలేకుండా రాత్రి 10 గంటలకు వచ్చిన బస్సు గ్రామంలో నిలిపి తెల్లవారి జామున 4.30 గంటలకే ఆకుకూరలు, కూరగాయలు వ్యాపారస్తులతో ప్రయాణం మొదలయ్యేది.. అలాంటిది ఆర్టీసీ అధికారుల చర్యలతో ఉదయం 6గంటల వరకు బస్సు ఉండటం లేదు. దీంతో రాత్రివేళ కరేడు గ్రామానికి రావాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు.

నాగేంద్రుడికి కాకర్ల ప్రత్యేక పూజలు


నాగేంద్రుడికి పూజలు చేస్తున్న కాకర్ల

కొండాపురం, మార్చి 17: మండలంలోని సాయిపేట పంచాయతీ మక్కెనవారిపాలెంలో వెలసియున్న నాగేంద్రుడికి ఉదయగిరి టీడీపీ- బీజేపీ-జనసేనల కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం కార్యక్రమానికి వెళ్తూ స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో మాట్లాడారు. అనంతరం సాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెంలో నాగేంద్రునికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులను అందుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్‌ను మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

దినసరి కార్మికుల జీతాలు చెల్లించకుంటే సమ్మె


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కావలి, మార్చి 17: కావలి పురపాలక సంఘంలో డైలీవేజ్ కింద పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించకుంటే సమ్మెకు దిగాల్సి వస్తోందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లె అంకయ్య, జిల్లా కార్యదర్శి గుంజి కిషోర్ మాట్లాడుతూ డైలీవేజ్ కింద ఎప్పటి నుంచో పనిచేస్తున్న వారికి జీతాలు సక్రమం గా ఇవ్వకుండా కొందరికి మాత్రమే ఇచ్చి మిగతావారిని ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. అలాగే ఆప్కాస్ విధానంలో డైలీవేజ్ కార్మికులను తీసుకోవాల్సింది పోయి ఎవరినో కొత్త వారిని తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, ఉపకార్యదర్శి ప్ర భా వతి, ఏఐటీయూసీ నాయకులు ఎండ్లూరి రవి, తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి


లింగసముద్రం పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ కమల్‌కుమార్

లింగసముద్రం, మార్చి 17 : ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లింగసముద్రం, పెదపవని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఎస్ కమల్‌కుమార్, గొర్రెపాటి మాల్యాద్రిలు తెలిపారు. ఆదివారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రం, పెదపవని జడ్పీ హైస్కూల్ ఏర్పాట్లను పరిశీలించారు.

వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు హైస్కూళ్లలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరగనున్నట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి

కందుకూరు, మార్చి 17: వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి మేడా మల్లికార్జున ఆపార్టీకి రాజీనామా చేసి ఆదివారం తన అనుచరులైన 15 కుటుంబాల వారితో కలిసి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ యువనాయకుడు మేడా మల్లికార్జునకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పట్టణంలో పాత, కొత్త నాయకులంతా కలిసి పనిచేసి సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్న ఆలోచనతో వైసీపీకి రాజీనామా చేసినట్లు మేడా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ మున్నా, సవిడిబోయిన వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటూరి రాజేష్ అభిమానుల ఆత్మీయ సమావేశం

కందుకూరు: టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, యువనేత ఇంటూరి రాజేష్ అభిమానుల ఆత్మీయ సమావేశం సోమవారం సాయంత్రం 4 గంటలకు కందుకూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటనలో విడుదలైంది. పామూరు రోడ్డులోని ఇంటూరి రాజేష్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాజేష్ కూడా పాల్గొంటారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

ముస్లిం వీధికి రెండేళ్లుగా అందని తాగునీరు


ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

అల్లూరు, మార్చి 17 : మండలంలోని నార్తుమోపూరులో ముస్లింవీధికి రెండేళ్లుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఈ ప్రాంతానికి తాగునీటిని అందించే మోటార్లు మరమ్మతులకు గురికావడంతో సరఫరా ఆగిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమ వద్ద నిధులు లేని కారణంగా మరమ్మతులు చేయలేమని చేతులెత్తేశారు. దీంతో చేసేది లేక బయటి ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు ప్రధాన రహదారిలో వీధిలైట్లు మరమ్మతులకు గురికావడంతో ఈ ప్రాంతంలో రాత్రి సమయాల్లో బయటికి రావాలంటే ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. దీని గురించి పలుమార్లు అధికారులకు తెలుపుకున్నా ఫలితం లేకపోయిందని గత ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న నాయకులను అడిగినా ఇప్పటికే అనేక నిధులు వెచ్చించామని ఇక వెచ్చించే పరిస్థితి లేదని చేతులెత్తేశారన్న ఆరోపణలున్నాయి. అసలే రంజాన్ మాసం కావడంతో ఉపవాసాలు ఉండే మహిళలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేకువజామున ఒకరి ఇంటికి ఒకరు వెళ్లి నిద్రలేపే కార్యక్రమాన్ని చేపట్టాలన్నా చీకటి కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మహిళలు స్థానిక టీడీపీ నాయకుడు నెల్లూరు నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా చొరవ తీసుకున్న ఆయన సొంత నిధులతో వీధిలైట్లు వేయించి మూడు రోజులుగా వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముస్లిం వీధికి తాగునీటిని సరఫరా చేసే విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని, మలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గౌడ్‌లకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలి

కలిగిరి, మార్చి 17: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గౌడ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషను ఏర్పాటు చేసి వారి జీవనప్రమాణాలు పెంపొందించడంతోపాటు, వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు తోట ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని తూర్పుగుడ్లదొనలో ఇటీవల పాము కాటుకు గురై చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న పరిశిబోయిన కొండస్వామి అనే గీత కార్మికుడిని ఆదివారం పరామర్శించి కోసూరు గోవిందయ్య గౌడ్ ఆశయసాధన నిమిత్తం ఏర్పాటు చేసిన గౌడసేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కల్లుగీతపారిశ్రామికుల సంఘ సభ్యులు కోనూరు రాజశేఖర్, ఉప్పాల రామకృష్ణయ్య, చిన్న గోవింద్, మోర్ల వెంకటేశ్వర్లు, పంది పెంచలయ్య పాల్గొన్నారు.

నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ఇరుముడులలో శ్రీశైలం బయలుదేరిన భక్తులు

బిట్రగుంట, మార్చి 17: బోగోలు మండలం నాగులవరంలో వెలసి ఉన్న గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆగ్రామానికి చెందిన శివమాలధారణ భక్తులు 48 రోజుల దీక్ష పూర్తి చేసుకున్న వారు లయంలో ఇరుముడిలు కట్టుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

జోరుగా నేతల ఎన్నికల ప్రచారం

బిట్రగుంట, మార్చి 17: బోగోలు మండలంలో పలు పార్టీల నేతలు ఎన్నికల ప్రచారాల ఊపు పెంచారు. ఆదివారం ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు సీఆర్‌పాలెం, సిద్దనపాలెం, అల్లిమడుగు అగ్రహారాల్లో పర్యటించి ఓటర్లతో మాట్లాడారు. కావలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగానైనా లేకపోతే బీఎస్పీ తరుపున పోటీలో ఉంటానన్నారు. ఆయన వెంట దళిత నేతలు కోవూరు బాబు, కావూరి బంగారయ్య, కప్పల నవీన్‌కుమార్, కాకాని రంగయ్య, సుబ్రహ్మణ్యం ఉన్నారు. స్వతంత అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ మండలంలోని పలు గ్రామాలో ఎన్నికల ప్రచారం చేశారు. అల్లూరు మండలానికి చెందిన గ్రద్దగుంట, బట్రకాగోల్లు, పల్లిపాడు, అల్లూరుపేట, నార్త్ అములూరు గ్రామాల నుంచి పలువురు సుధాకర్‌కు మద్దతుగా పార్టీలో చేరారు. బేతనీ పేటలో వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. దీంతో ప్రచారాలు ఊపందుకున్నాయి.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎంఈవో

● కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు : ఎస్ఐ

మనుబోలు, మార్చి 17: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు జరగనున్నాయి. మండల కేంద్రమైన మనుబోలులో రెండు పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శేషాద్రి వాసు తెలిపారు. మండలంలోని మనోబోలులో రెండు హైస్కూల్స్‌తోపాటు అక్కంపేట, మడమనూరు, వీరంపల్లి, బద్దెవోలు, మనుబోలులోని సుశ్రుత ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్లలోని మొత్తం 399 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మనుబోలు బాలుర హైస్కూల్‌లో 189 మంది, గర్ల్స్ హైస్కూల్‌లో 210 మంది పరీక్షలు రాస్తున్నారు. జంబ్లింగ్ విధానంలో ఈ రెండు సెంటర్లలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం నెంబర్లను వేసి రూములు కేటాయించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

బుచ్చిలో ఏడు కేంద్రాలు : ఎంఈవో



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆదివారం ఎంఈవో దిలీప్‌కుమార్ తెలిపారు. డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 240మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 120, రత్నం హైస్కూల్లో 160, రేబాల సెంట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 150, వివేకానంద హైస్కూల్లో 220, నారాయణ హైస్కూల్లో 160, రామచంద్రాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 260 మంది మొత్తం 1310 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. అందరూ బెంచ్‌లపైనే పరీక్షలు రాసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తాగునీరుతోపాటు అన్ని మౌలిక వసతులు, వైద్య ఆరోగ్య సేవలతో పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సెల్‌ఫోన్‌లు లోనికి అనుమతించరన్నారు.

పొదలకూరు: పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కేంద్రాల్లో ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర వసతులు కల్పించారు. పేపర్ లీకేజీలు, మాల్ ప్రాక్టీస్‌లకు అవకాశం లేకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. పొదలకూరు మండల పరిధిలో 865 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 216 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది, శ్రీచైతన్య హైస్కూల్‌లో 184 మంది, మహమ్మదాపురంలోని జడ్పీ బాలుర పాఠశాలలో 215 మంది విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు కూర్చునే గదిలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఒత్తిడికి గురికావద్దని సూచించారు.

ప్రజాగళం సభకు భారీగా తరలిన బీజేపీ నాయకులు



ప్రజాగళం సభకు తరలిన బీజేపీ కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం: చిలకలూరిపేట బొప్పిడి వద్ద బీజేపీ, టీడీపీ, జనసేన నిర్వహిస్తున్న ప్రజాగళం భారీ సభకు ఆదివారం బుచ్చితోపాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నాయకులు కాసా శ్రీనివాసులు, రామిశెట్టి మోహన్, సీహెచ్ వినయ్‌నారాయణ, గండి రఘురామయ్య, కీలుకుప్ప శ్రీనివాసులు, గంజం పెంచలప్రసాద్, శ్రీధర్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

సైదాపురం : ప్రజాగళం సభకు మండలం నుంచి 100 మంది టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, దిలీప్ చౌదరి, కీర్తిపాటి రాజశేఖర్ రాజు, కేవీరాజు, దశయ్య నాయుడు, పాములూరి శ్రీనివాసులు నాయుడు, బోయిన రమేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, మార్చి 17 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు... చవటపాలెం గ్రామానికి చెందిన తాటిపర్తి సుబ్బరామయ్య పని నిమిత్తం వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు మోటారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బరామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాప్రభుత్వం ఏర్పాటు తథ్యం



రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న గుడి హరికుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట, మార్చి 17: ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని నెల్లూరుజిల్లా పవన్ కల్యాణ్ యువత అధ్యక్షుడు, కోవూరు నియోజకవర్గ జనసేన పార్టీ కేర్ టేకర్ గుడి హరికుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో రాంచరణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరానికి జన సైనికులు, మెగా అభిమానులు, వీర మహిళలు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయేది ప్రజాప్రభుత్వమేనని, కోవూరు నియోజక వర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమన్నారు. ఈకార్యక్రమంలో జనసైనికులు, నాయకులు, వీరమహిళలు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరత్నం యాదవ్, నందిని యాదవ్, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, కోవూరు నియోజక వర్గం చిరంజీవి యువత, పవన్‌కల్యాణ్ యువత అధ్యక్షుడు లోకేష్, శ్రీకాంత్, కార్యక్రమ నిర్వాహకులు మారుతి, అష్వక్, నాయబ్, ఖలీల్, పవన్‌కల్యాణ్ యువత పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఆర్వో

వెంకటాచలం, మార్చి 17: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సర్వేపల్లి నియోజకవర్గ ఆర్వో చినఓబులేసు హెచ్చరించారు. వెంకటాచలంలోని తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలను, సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలు, బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 17 : మండంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కొత్తూరు హైస్కూల్ టీచర్ పివి శేషయ్య మహాత్మాగాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు గంపల మంజుల స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలు, గాంధీ ఆశ్రమ చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడిపోయిన ప్రయాణికుడు

● కాపాడిన ఆర్పీఎఫ్, 108 సిబ్బంది



గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

మనుబోలు, మార్చి 17: రైలు నుంచి పడిపోయిన ఓ ప్రయాణికుడి ప్రాణాలను అతి కష్టం మీద ఆర్పీఎఫ్, 108 సిబ్బంది కాపాడగలిగారు. ఈ సంఘటన ఆదివారం మనుబోలు మండల పరిధిలోని దువ్వూరులోని డొంక సమీపంలో చోటు చేసుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని నాడియా జిల్లా గజ్నా గ్రామానికి చెందిన హసనూరు మౌలా చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో కలకత్తా నుంచి ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తూ ఫుట్‌బోర్డు వద్ద కూర్చుని నిద్రలోకి జారుకొని దువ్వూరు వారి డొంక వద్ద జారి ముళ్లపొదల మధ్య పిల్లర్ కింద భాగంలో తీవ్రగాయాలకు గురై పడిపోయాడు. ఆదివారం ఉదయం పెట్రోలింగ్‌కి వచ్చిన ఆర్పీఎఫ్ ఏఎస్ఐ సీకేఎన్ రావు గుర్తించి 108కి సమాచారం ఇచ్చారు. చిల్లకూరు 108 ఈఎంటీ కృష్ణ, పైలట్ మురళీకృష్ణలు అక్కడికి చేరుకుని ముళ్ల పొదల్లో ఉన్న మౌలాను బయటకు తీసి ప్రథమ చికిత్సచేశారు. ఆర్పీఎస్ ఏఎస్ఐ కేఎన్ రావు, కానిస్టేబుల్ సునీల్ బుద్దాని సాయంతో మౌలాను హాస్పిటల్‌కి తరలించారు. 108, ఆర్పీఎఫ్, సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఆలయ మరుగుదొడ్లకు మోక్షం



సిద్ధమైన మరుగుదొడ్లు, స్నానపు గదులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 17: మండలంలోని జొన్నవాడ ఆలయ మరుగుదొడ్లకు ఎట్టకేలకు అధికారులు మోక్షం కల్పించారు. ఆలయానికి చెందిన మరుగుదొడ్లు, స్నానపు గదుల్లో దుర్గంధం వెదజల్లుతోందని ఇటీవల కొంతమంది భక్తులతోపాటు బీజేపీ నాయకులు జొన్నవాడ ఆలయ పరిసరాలను సందర్శించి ఆమేరకు మరుగుదొడ్లు శుభ్రంచేయించి భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరిన విషయం విదితమే. ఈమేరకు ఆలయ మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిసరాలను శుభ్రపరచి సిద్ధంచేసినట్లు ఆదివారం ఆలయ ఈవో వి. గిరికృష్ణ తెలిపారు.

జోరుగా తాగునీటి వ్యాపారం

● విచ్చలవిడిగా వెలుస్తున్న వాటర్‌ప్లాంట్లు

పొదలకూరు, మార్చి 17: మండలంలో తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవి సమీపిస్తుండడంతో కొత్తగా వాటర్ ప్లాంట్‌లు వెలుస్తున్నాయి. మండలంలో ఒకటి, రెండింటికి తప్ప మిగతా వాటర్ ప్లాంట్‌లకు అనుమతులు లేవని, కనీస ప్రమాణాలు పాటించకుండా నీటి వ్యాపారం చేస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అన్నిరకాల పరీక్షలతో శుద్ధిచేసిన నీటిని తయారుచేసే ప్లాంట్లను నిర్మించాలంటే కనీసం రూ.10లక్షలు అవుతుంది. ఐఎస్ఐ మార్కు ప్రమాణాలు లేకుండా నీటి వ్యాపారం చేస్తున్నారు. 20లీటర్ల క్యాన్ నీటిని రూ.10 నుంచి రూ.15కు విక్రయిస్తున్నారు. నీటి నాణ్యతను అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. కొందరైతే కుళాయిల నీటినే నింపి అందులో కెమికల్స్ కలిపి అమ్ముతున్నారు. మరికొన్ని చోట్ల నీటిని శుద్ధిచేసే సాధారణ ఫిల్టర్ ఉండే స్టీల్ ట్యాంకును ఏర్పాటు చేస్తున్నారు. ఫిల్టర్లు దెబ్బతిన్నా అందులో నుంచే నీటిని క్యాన్‌లలో నింపుతున్నారు. నీటిలో రుచి మారడానికి అనారోగ్యాన్ని కలిగించే కెమికల్స్ వినియోగిస్తున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్‌ల నిర్వహణ చేపట్టేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

కోడ్ ఎఫెక్ట్ !



తడికల బజారు సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి ముసుగు



రమేష్‌రెడ్డి నగర్ సచివాలయంపై ఉన్న వైసీపీ రంగును తొలగిస్తున్న సిబ్బంది



బీవీఎస్ హైస్కూల్ గోడలపై పోస్టర్లకు వేసిన రంగులు

సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీనిని అమలుపరిచే చర్యలను అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో స్టోన్‌హౌస్ పేటలోని ఇందిరాగాంధీ బొమ్మ (బీవీఎస్ హైస్కూల్ ఎదుట)కు ముసుగు తొడిగారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై అంటించిన పోస్టర్లు తొలిగించారు. కొన్ని చోట్ల వాటికి రంగు పూశారు. ఫత్తేఖాన్‌పేట సచివాలయం కార్యాలయానికి వేసిన వైసీపీ రంగులను తొలగించారు. కాగా, ఇంకా పలు డివిజన్లలో పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాల్సి ఉంది. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాల్సి ఉంది.

- నెల్లూరు (సాంస్కృతికం)

'ప్రజాగళం'కు భారీగా..

● రూరల్ నుంచి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు



వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (వైద్యం), మార్చి 17 : ఎన్‌డీఏ కూటమి చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ప్రజాగళం పేరుతో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. ఉదయం 10గంటలకు కస్తూరిదేవి గార్డెన్స్ నుంచి 300 వాహనాలలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు దొడ్డపనేని రాజానాయుడు, జెన్ని రమణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జులు జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, సారంగం గున్నయ్య, కుడుముల చిరంజీవి, మన్నెం పెంచల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

● జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం)మార్చి 17 : సీపీఎం అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిందని, రాబోవు ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని 16వ డివిజన్ నందన్ పార్క్‌లో స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయ మహల్ గేటు వద్ద బాక్స్‌టైప్ బ్రిడ్జి, ఐరన్‌ఓర్ లారీలను అడ్డుకోవటం వంటి ఎన్నో ప్రజాపోరాటాలు చేశామన్నారు. బాలసుబ్రహ్మణ్యం పార్క్ స్థలం కబ్జాకు గురికాకుండా ప్రజలకు అంకితం చేశామన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యర్థికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సీఏలకు ఆరోగ్య సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : ప్రపంచ మహిళా దినోత్సవం నేపథ్యంలో నగరంలోని మహిళా చార్టర్డ్ అకౌంటెంట్స్‌కి ఆరోగ్య సదస్సును ఆదివారం మాగుంట లే అవుట్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. అతిథులుగా ఎస్ఐఆర్‌సీ అధ్యక్షురాలు ఎంబీ గీత, ఎస్ఐఆర్‌సీ కౌన్సిల్ సభ్యులు మండల సునీల్‌కుమార్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. మహిళా చార్టర్డ్ అకౌంటెంట్స్ సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఎంవీఎస్ సుజిత శ్రేయ మాట్లాడుతూ పని ఒత్తిడి తట్టుకుని ఆరోగ్యంగా ఎలా జీవించాలి అనే విషయాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు శాఖ చైర్మన్ యువ రాజేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ఆత్మీయ సత్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : నగరంలోని నవాబుపేట ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సత్కారం కార్యక్రమం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్యవైశ్యుల ఐక్యతే తమ లక్ష్యమని ముక్కాల తెలిపారు. ఈ సందర్భంగా గుండాల గురవయ్యకు వెండి కంకణం తొడిగి, గజమాలతో సత్కరించారు. ప్రతిభా వంతులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జ్యోతిప్రసాద్, శ్రీరామ్‌సురేష్, అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకులు వాయుగుండ్ల పద్మ, పిండి వెంకటలక్ష్మి, పేర్ని సీతారామ్, అమరా మోహన్ రావు, కే శోభన్‌బాబు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన

నెల్లూరు (విద్య): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. అరవింద్ కిడ్నీ సెంటర్ వైద్యుడు నారాయణరావు వాకర్స్ సభ్యులకు కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఆహార నియమాలను తెలియజేశారు. వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం వెంకట సురేంద్ర, కార్యదర్శి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతి నాయుడు, మాజీ అధ్యక్షుడు శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

సోదరభావాన్ని పెంచే రంజాన్ మాసం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : రంజాన్ శుభ్రపదమైన నెల, సోదర భావాన్ని పెంపొందించే మాసమని ఆంధ్రప్రదేశ్ జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీఖ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక మెక్లిన్స్ రోడ్ ఎస్ఆర్ఎస్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధనికులు, పేదలు వ్యత్యాసం లేకుండా రంజాన్ శుభాలు పొందేందుకు సంతోషంతో పరస్పరం సహకరించుకుంటారన్నారు. కొంతకాలంగా దేశంలో ధార్మిక ఉన్మాదం పెరిగిందని, ఇది సమాజాన్ని కలుషితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో శాంతి, సౌభాగ్యాన్ని, దేశ ఉన్నతిని ఆకాంక్షించేందుకు తమ సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఇఫ్తార్ విందులో పాస్టర్లు వీ హరిగోపాల్, హెబెల్ రాజ్, జాన్‌బాబు, రాజశేఖర్ జమాతే ఇస్లామి హింద్ నగర శాఖ అధ్యక్షుడు నవీద్, ఖయ్యూమ్, అయాజ్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

వేదగిరిపై విఖనస మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



వేదగిరి క్షేత్రంలో ప్రతిష్ఠించిన విఖనస మహర్షి విగ్రహం

నెల్లూరు రూరల్, మార్చి 17 : ఆగమశాస్త్ర సూత్రకర్త అయిన విఖనస మహర్షి శిలా విగ్రహాన్ని భృగు, మరీచి, అత్రి, కశ్యప తదితర శిష్య సమేతంగా ఆదివారం వేదగిరి క్షేత్రంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, మహా శాంతి హోమం, అష్టబంధనం, కుంభప్రోక్షణ జరిగాయి. బెంగళూరుకు చెందిన అడపాల నరేష్ కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

డాక్టర్ రమణయ్య లైసెన్సు రద్దు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహిస్తున్న డాక్టర్ టీ రమణయ్య అనే వైద్యుడి మెడికల్ లైసెన్సు రద్దు చేయాలని నగరంలోని ఉస్మాన్‌సాహెబ్ పేటకు చెందిన షేక్ ఖాజామస్తాన్ అనే వ్యక్తి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ రమణయ్య నిర్లక్ష్య వైద్యం, వ్యాపార ధోరణి కారణంగా తన తల్లి మరణించిందని చెప్పారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశామని, స్పందించిన మెడికల్ కౌన్సిల్ విచారణ జరిపి డాక్టర్‌ను మూడు నెలలు వైద్యం చేయకుండా సస్పెండ్ చేసిందని తెలిపారు. అయితే తమకు జరిగిన నష్టానికి సస్పెన్షన్ సరిపోదని, ఆయన మెడికల్ ప్రాక్టీసు లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు.

ఆస్తి కోసం దౌర్జన్యం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 17 : తమ తాతకు చెందిన ఆస్తిలో వాటాగా తనకు, తన తమ్ముడికి రూ.3కోట్ల విలువైన ఆస్తి రావాల్సి ఉందని పోతిరెడ్డిపాళెంకు చెందిన షేక్ సల్మా తెలిపింది. ఆమె ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడింది. తమకు రావాల్సిన ఆస్తిని కాజేసేందుకు బంధువులే దౌర్జన్యం చేస్తూ, బెదిరిస్తున్నారని ఆరోపించింది. ఉన్నతాధికారులు విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది





చిల్లకూరు మండలం బల్లవోలు సమీపంలో టిప్పర్‌కి లోడు చేస్తున్న సిలికా



తేనేటివాగు వద్ద సిలికా నిల్వలు

కోట సిద్ధవరం వద్ద అసైన్డ్ భూముల్లో ఉన్న సిలికా



వైసీపీ సిలికాసురులు

ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోని రూ.కోట్ల ఖనిజ సంపద కొల్లగొడుతున్నారు

సముద్ర తీర మండలాల్లో విస్తారంగా ఉన్న సిలికాపై వైసీపీ నేతలు కన్నేశారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ అనధికారికంగా తవ్వేస్తూ కోట్ల రూపాయల ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. రాయల్టీ, సీనరేజ్ చార్జీలు చెల్లించకుండా ప్రభుత్వానికీ పంగనామం పెడుతున్నారు. - కోట

కోట, చిల్లకూరు మండలాల్లో విస్తారంగా సిలికా ఖనిజ నిల్వలు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో అధికారికంగా 77 సిలికా మైన్‌లు ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు రంగ ప్రవేశం చేశారు. ఇంకేఅన్ని మైన్‌లన్నీ తమ గుప్పెట్లోకి తీసుకొన్నారు. చిల్లకూరు మండలంలోని చింతవరం, మోమిడి, వరగలి, బల్లవోలు, వేళ్లపాళెంలతోపాటు కోట మండలం సిద్ధవరం కర్లపూడి, గోవిందపల్లి, కొత్తపట్నం, శ్రీనివాసాసత్రం గ్రామాల్లో అధికారిక మైన్‌లున్నాయి. వీటిల్లో నిల్వలు అయిపోవడంతో పక్కన ఉన్న ప్రభుత్వ, పేదల ఆధీనంలోని అసైన్డ్ భూములపై కన్నేశారు.

ఎకరా అసైన్డ్‌భూమికి రూ.2-3 లక్షలిస్తున్నారు

ఎకరా అసైన్డ్ భూమిలోని సిలికా తవ్వుకోవడానికి పేదలకు రూ.2-రూ.3 లక్షలు ఇస్తున్నారు. కొందరు అంగీకరించకుంటే బెదిరించి మరీ భూములను లాక్కొంటున్నారు.

అనుమతులు ఓ చోట.. తవ్వకాలు మరోచోట

అనుమతులు ఒకచోట ఉంటే.. తవ్వకాలు మరోచోట జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా సిలికాను తవ్వేసి, బయటి రాష్ట్రాలకు అడ్డదారుల్లో తరలిస్తూ.. కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

తేనేటివాగు టార్గెట్ : కోట మండలం సిద్ధవరం పంచాయతీలో సర్వే నెంబరు 39-20లలో ఉన్న 280 ఎకరాల విస్తీర్ణంలో సిలికా నిల్వలున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ భూములే. ఈ భూములున్న ప్రాంతం తేనేటివాగుగా రెవెన్యూ రికార్డులో ఉంది. వీటిల్లో 150 ఎకరాలు ఏపీఐఐసీ తీసుకోగా.. మిగతావి సిద్ధవరం దళితుల ఆధీనంలో ఉన్నాయి. వీటికి పట్టాలున్నాయి. ఈ మొత్తం భూములపై వైసీపీ నేతలు కన్నేసి, సిలికాను తవ్వేస్తున్నారు. అలాగే ఇదే మండలంలోని గోవిందపల్లి, సిద్ధవరం గ్రామాల సరిహద్దుల్లో సర్వేనెంబరు 628లో సుమారు 120 ఎకరాలు ఏపీఐఐసీకి చెందిన భూములున్నాయి. ఈ భూముల్లోనూ సిలికా నిల్వలు ఉండటంతో రాత్రిపూట వందలాది టిప్పర్లతో ఖనిజాన్ని తోడేస్తున్నారు. వీటితోపాటు కోట, చిల్లకూరు మండలాల్లో దేవదాయశాఖకు చెందిన సుమారు 50 ఎకరాల్లోనూ ఖనిజాన్ని తవ్వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం

టన్ను సిలికాకు రాయల్టీ పేరుతో ప్రభుత్వానికి రూ.350 చెల్లించాల్సి ఉంది. సీనరైజ్ చార్జీలు లక్షల్లో ఉంటాయి. ఈ రెండూ కోట్ల రూపాయల్లోనే ప్రభుత్వానికి చెల్లించాలి. దీంతో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతోంది.

నిఘా పెడతాం

సిలికా అక్రమ తవ్వకాలపై నిఘా పెడతాం. రెవెన్యూ అధికారుల సహకారమూ తీసుకుంటాం. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రంగకుమార్, మైనింగ్ ఏడీ

ఇంకా సర్దుకోని అసంతృప్తులు

● అసమ్మతి, విభేదాలతో ప్రధాన పార్టీలు సతమతం

తిరుపతి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక కూడా జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఇంకా అసంతృప్తులు సర్దుకోలేదు. ప్రధాన రాజకీయ పార్టీలు అసమ్మతి, వర్గ విభేదాలు, అలకలతో సతమతమవుతున్నాయి.

తిరుపతికి జనసేన పరిశీలకుడి రాక

తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పార్టీ శ్రేణులు సహకరించడంపై చర్చించేందుకు పరిశీలకుడిగా అజయ్‌కుమార్‌ను అధిష్ఠానం పంపింది. ఆదివారం ఆయన జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్,రాజారెడ్డితో భేటీ అయ్యారు.పార్టీ ఆవిర్భావం నుంచీ పనిచేయడంతో పాటు పోలీసు కేసుల సహా వేధింపులు ఎదుర్కొన్నానని, కుటుంబాన్ని కూడా కష్టాల్లోకి నెట్టానని కిరణ్ రాయల్ వాపోయారు. తన రాజకీయ భవిష్యత్తుపై పవన్ స్పష్టమైన హామీ ఇస్తే అభ్యర్థి గెలుపునకు పనిచేస్తానని చెప్పారు. రాజారెడ్డి సైతం పార్టీ అధినేత చెబితేనే తాము ఎన్నికల్లో పనిచేస్తామన్నారు. కాగా, ఒకరిద్దరు నేతలు, శ్రేణులతో కలిసి జనసేన అభ్యర్థి శ్రీనివాసులు ప్రచారం చేశారు.

సర్దుకోని సత్యవేడు

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం విషయంలో ఆ పార్టీ శ్రేణులు ఇంకా సర్దుబాటు కాలేదు. ఆయనకు వ్యతిరేక కేవీబీపురంలో కొందరు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హేమలత లేదా డాక్టర్ హెలెన్‌లో ఒకరికి అవకాశం ఇవ్వాలంటూ నాగలాపురంలోనూ కొందరు నినాదాలు చేశారు.

శ్రీకాళహస్తిలో ఇంకా అందని మిత్రపక్షాల సహకారం

శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నుంచీ ఇంకా సహకారం అందలేదు. తనకు టికెట్ రాలేదని టీడీపీ నేతలు హేళన చేస్తూ తన ఇంటి ఎదుట టపాసులు కాల్చారని జనసేన ఇన్‌చార్జి వినుత ఆరోపించారు. సుధీర్‌రెడ్డి ఇంతవరకూ తనను కలవలేదని, ఫోన్ కూడా చేయలేదన్నారు. పవన్ కల్యాణ్‌తో మాట్లాడాక తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. బీజేపీ శ్రేణులూ సహకరించడం లేదు. అయితే టికెట్ ప్రకటించి మూడు రోజులే కావడం, ఈలోపు చిలకలూరిపేటలో కూటమి సభకు వెళ్లే ఏర్పాట్లలో సుధీర్‌రెడ్డి బిజీగా ఉన్నందున జనసేన, బీజేపీ నేతలను కలవలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఒకటి రెండురోజుల్లో అందరినీ కలిసి.. సహకారం కోరనున్నారన్నారు.

వెంకటగిరిలో రెండు శిబిరాల్లోనూ కలకలం

వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్న వర్గానికి నేతృత్వం వహిస్తున్న మెట్టుపల్లి ధనుంజయరెడ్డి ఆదివారం రాపూరులో అనుచరులతో సమావేశమయ్యారు. వైసీపీ అభ్యర్థిగా తాము వ్యతిరేకించిన వ్యక్తినే ప్రకటించిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. త్వరలో ఒక నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకోవడంతో వైసీపీలో కలకలం రేగింది.

● కాగా, టీడీపీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని చంద్రబాబును అభ్యర్థిస్తూ బీసీ కులాల ఐక్య వేదిక పేరిట ఆదివారం వేకువ జామున వెంకటగిరిలో ఫ్లెక్సీలు వెలిశాయి. ఇక్కడి టికెట్ ఆశించిన బీసీ నేత మస్తాన్ యాదవ్ అనుచరులు లేదా అభిమానులు వీటిని ఏర్పాటు చేసి ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది.

వేనాటి రామచంద్రారెడ్డితో వైసీపీ నేతల భేటీ?

సూళ్లూరుపేట టీడీపీకి రాజీనామా చేసిన వేనాటి రామచంద్రారెడ్డిని ఆదివారం హైదరాబాదులో వైసీపీకి చెందిన నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి కలిసినట్టు తెలిసింది. వైసీపీలో చేరిక గురించి చర్చించినట్టు సమాచారం. రామచంద్రారెడ్డి తనయుడు సుమంత్‌రెడ్డి కూడా తడ మండలంలో పలువురు టీడీపీ వర్గీయులను కలిసి తన తండ్రి నిర్ణయానికి మద్దతిచ్చి తమతో నడవాలని కోరుతున్నట్టు తెలిసింది.

తిరుపతిలో...



ఒకటి, రెండ్రోజుల్లో స్పష్టత వస్తుంది

- కలెక్టరేట్ అధికారులు

తిరుచానూరు: ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేసిన హోర్డింగులు, సైన్ బోర్డులను కూడా తొలగించాల్సిందేనని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అయితే దీనిపై ఒకటి, రెండ్రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు.

తొలగని హోర్డింగులు

తిరుపతి క్రైం, మార్చి 17: తిరుపతిలోని చాలా ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రానికి కూడా వైసీపీకి చెందిన హోర్డింగులు తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కొన్నిచోట్ల మాత్రం శనివారం రాత్రి నుంచే వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు, జెండాలు, కటౌట్ల తొలగింపు ప్రారంభమైన విషయం తెలిసిందే.





వంతెన వద్ద ఉన్న సిద్ధం హోర్డింగు - వైఎస్ విగ్రహం వద్ద కనిపిస్తున్న పేరు

రేణిగుంటలో.. పట్టణంలోని వంతెన వద్ద వైసీపీకి చెందిన సిద్ధం హోర్డింగును ఆదివారం కూడా తొలగించలేదు. ప్రధాన కూడలిలో వైఎస్ విగ్రహానికి ముసుగేసినా ఆయన పేరు కనిపిస్తోంది.

- రేణిగుంట

బాలాయపల్లిలో..

బాలాయపల్లి: వెలుగు కార్యాలయం వద్ద ఉన్న గేటు గోడలకు వైసీపీ పోస్టర్లు అలాగే ఉన్నాయి. ఆదివారమైనా వీటిని తొలగించలేదు.



పాకాలలో..

పాకాల: పంచాయతీ కార్యాలయం ప్రహరీపై సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆయిల్ పెయింటింగ్స్ అలాగే ఉన్నాయి. ఆదివారం రాత్రికి కూడా వీటిని తొలగించలేదు.





తిరుమలలో పారిశుధ్య కార్మికుల నిరసన

● పీఎన్ఎస్ సంస్థ ఇబ్బంది పెడుతోందని ఆరోపణ

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థ అయిన పీఎన్ఎస్‌లో పనిచేసే సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులు తిరుమలలో ఆదివారం వేకువజామున నిరసన వ్యక్తం చేశారు. తమను ఇబ్బంది పెడుతోందని ఆరోపిస్తూ.. దానికింద పనిచేసే వీరంతా వైకుంఠం క్యూకాంప్లెక్స్, పద్మావతి ఏరియాలో విధులు బహిష్కరించారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని కార్యాలయం ముందు బైఠాయించారు. అత్యవసర సమయంలో లీవ్ తీసుకుంటే విధులను నుంచి తొలగిస్తున్నారని, క్రిస్టియన్ల తరహాలో బొట్టు, పూలు, కాళ్లకు గొలుసులు వేసుకోవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని కూడా తగ్గించి పని భారం పెంచేస్తున్నారని, కాసేపు సేద తీరితే ఫొటోలు తీసి.. విధులకు రావద్దని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదేమని అడిగితే.. 'ఉంటే ఉండు.. లేకపోతే వెళ్లిపో' అంటున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న టీటీడీ హెల్త్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రయోజనం లేకపోవడంతో హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని, విధులకు హాజరుకావాలని కోరారు. దాంతో కార్మికులు విధులకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పీఎన్ఎస్ సంస్థ నిర్వాహకులు తరచూ కార్మికులను వేధిస్తున్నారన్నారు. ఇకనైనా ఈ సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రవాణాశాఖ చెక్‌పోస్టుల మూత

తడ, మార్చి 17: రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో నడిచే చెక్ పోస్టులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం మూసివేసింది. ఇందులో భాగంగా తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద ఉన్న చెక్‌పోస్టు కూడా మూతపడింది. ఇక్కడ ఉన్న అధికారులు, సిబ్బందికి ఎన్నికల కోసం ఏర్పాటైన చెక్‌పోస్టుల్లో విధులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అవసరమైతే జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం సదరు సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉంటుందని సమాచారం.



తడ మండలంలోని భీములవారిపాళెం రవాణాశాఖ చెక్‌పోస్టు

కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం

● మరో ఇద్దరికి గాయాలు

తిరుచానూరు, మార్చి 17: ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి జీవకోన చెందిన సందీప్(21) పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం పుత్తూరు నుంచి ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని దామినేడు సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా.. ముందు వెళుతున్న కారు సడన్ బ్రేక్ వేసింది. దీంతో ఈ కారును వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా సడన్ బ్రేక్ వేయడమే ప్రమాదానికి కారణమని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దాంతో కారు డ్రైవర్‌ని అరెస్టు చేసి, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా, సందీప్ తల్లిదండ్రులు అక్కడికొచ్చి బోరున విలపించారు. మిగిలిన ఇద్దరు కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు తెలిపారు.



కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అక్షరాలు

ఇంతకీ ఈ కారెవరిది?

ప్రమాదానికి కారణమైన కారుపై టీటీడీ లోగో, మెంబర్ ఆఫ్ పార్లమెంటు అనే అక్షరాలు ఉండటం గమనార్హం. ఈ కారు ఎవరిదన్న విషయంలో పోలీసులు గోప్యతను పాటిస్తున్నట్లు సమాచారం.



సందీప్ మృతదేహం

శ్రీవారి తెప్పోత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

తిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలకు ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో ఉత్సవర్లు విహరించే తెప్పను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. నీటిపై గాలితో కూడిన డ్రమ్ములను ఏర్పాటు చేసి, దానిపై మండపం రూపంలో ఉండే తెప్పను నిర్మించి.. రంగులు అద్దుతున్నారు.



సిద్ధమైన తెప్ప

ఏ రోజు ఎలా.. తొలిరోజున సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రమూర్తి తెప్పపై మూడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండో రోజున రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై మూడుసార్లు విహరిస్తారు. మూడో రోజున శ్రీభూ సమేతంగా మలయప్పస్వామి మూడుసార్లు పుష్కరిణిలో విహరించి, భక్తులను అనుగ్రహిస్తారు. నాల్గవ రోజున ఐదుసార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు.

గ్రూప్-1 పరీక్షలకు 6,037 మంది హాజరు

తిరుపతి(విద్య), మార్చి 17: జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 9,377 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 6,037 మంది హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 16 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. ఏఎస్పీ కులశేఖర్, ఇతర పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



తిరుపతి ఎస్వీ జూనియర్ కాలేజీ వద్ద హాల్‌టికెట్ల పరిశీలన

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గూడూరు, మార్చి 17: పదో తగరతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లును పూర్తి చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు అవసరమైన కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. పట్టణ పరిధిలో జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, సీఎస్ఎం, జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, సెయింట్‌మేరీస్, వివేకానంద పాఠశాలతో పాటు మండలంలోని చెన్నూరు జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:45గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు 9గంటల లోపే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. గూడూరు డివిజన్ పరిధిలోని 31 కేంద్రాల్లో 6341మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

వెంకటగిరి: పట్టణంలోని ఏడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వరావు తెలిపారు. పట్టణంలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ఏపీఆర్‌జేసీ, సైన్‌ఫ్రాన్సిస్ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాల్లో 1240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంఈవో చెప్పారు.

కోట: మండల పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈవో మస్తానయ్య ఆదివారం తనిఖీ చేశారు. కోటలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాల, విద్యానగర్ బాలభారతీ పాఠశాల, చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాలను ఎంఈవో పరిశీలించారు. ఈ కేంద్రాల్లో 1100 మంది విద్యార్థులు సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

చిట్టమూరు: మండలంలో మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బీవీ కృష్ణయ్య తెలిపారు. చిట్టమూరులో 175 మంది, కొత్తగుంట టీఎంఆర్‌లో 113 మంది, అరవపాలెం ఉన్నత పాఠశాలలో 155 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు ఆయన చెప్పారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువత



టీడీపీ చేరిన యువతతో నేతలు

సూళ్లూరుపేట, మార్చి 17: ఎన్నికల వేళ వైసీపీకి భారీ షాక్ తగిలింది. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి సమక్షంలో వైసీపీకి చెందిన పలువురు యువకులు టీడీపీలో చేరారు. ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలోని టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి వద్ద ఎస్‌కె.ఆలీబాయ్, దాసరి శశిధర్‌తో పాటు 60 మంది వైసీపీకి చెందిన యువకులు పసుపు కండువా వేసుకొన్నారు. వీరిలో సగం మంది మైనార్టీలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు నచ్చకే తాము పార్టీని వీడినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు అలవల శ్రీనివాసులు, రఫీ, వెంకటేశ్ యాదవ్, తడ నాయకులు టీకే శ్రీనివాసన్, రవి తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో దుష్టపాలన అంతం: నెలవల

తడ, మార్చి 17: మరో రెండు నెలల్లో దుష్టపాలన అంతమవుతుందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కొండూరు పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, తిరుమూరు సుధాకర్ రెడ్డి, మురళీరెడ్డి, సుదర్శన్, నీలకంఠం, జీవ, శివాజీ, చంద్రయ్య పాల్గొన్నారు.

షార్‌లో ఫ్లాగింగ్ రన్



ఫ్లాగింగ్ రన్‌లో పాల్గొన్న షార్ డైరెక్టర్, ఉద్యోగులు

సూళ్లూరుపేట, మార్చి 17: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం షార్ ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో షార్ లోపల ఉన్న పేస్-1, పేస్-2 నుంచి మొదటి వరకు ఫ్లాగింగ్ రన్ నిర్వహించారు. పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త చెదారాన్ని తొలగించారు. అదే విధంగా షార్ ఉద్యోగులు నివాసం ఉండే డీవోఎస్, డీఆర్‌డీఎల్ కాలనీలు, పులికాట్ నగర్‌లో క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో శంఖారావం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

కోట, మార్చి 17: మండల పరిధిలోని చెందోడు పంచాయతీ విద్యానగర్‌లో ఆదివారం టీడీపీ నాయకులు శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ ఇన్‌చార్జిలు, గ్రామకమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో దళిత, గిరిజనవాడల్లో ఇంటింటా తిరిగి సూపర్‌సిక్స్ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌ను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు తల్లిదండ్రుల దీవెనలు



విద్యార్థులకు ఆశీర్వదిస్తున్న తల్లులు

నాయుడుపేట, మార్చి 17: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తల్లిదండ్రులు దీవెనలు అందించారు. నాయుడుపేట మండలం పుదూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రూత్‌రెమోలా నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి కాకుండా పరీక్షలు రాయాలని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశికళ, శ్రీదేవి, చంద్రలీల, వరలక్ష్మి, జాన్సీ, సంపూర్ణ, భూలక్ష్మి, చెంగమ్మ, సుధా, సావిత్రి, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 17: ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. కోడ్ అమలుపై ఆయన ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో కూడిన పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని సీఈవో ఆదేశించారు. 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లో, అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాలన్నారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తడలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కారూరులో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తడ, మార్చి 17: తడలో పోలీసులు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ట్రైనీ ఎస్పీ దేవరాజ్‌మనీష్‌పాటిల్ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ దళాలతో తడ, రామాపురం, వెంకటాద్రిపాళెం, కారూరు, కాశీంగాడుకుప్పం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ట్రైనీ ఎస్పీ దేవరాజ్‌మనీష్ పాటిల్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 17: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఒగ్గు భాస్కర్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, అశోక్, విష్ణు, జగదీష్, మధు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచారి, మురళీసింగ్, సురేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని పొలాలపై క్వార్ట్జ్ మాఫియా పంజా

- అధికారం అండతో చెలరేగుతున్న వైనం
- రైతులకు తీరని నష్టం





నిమ్మతోటల్లో జరుగుతున్న అక్రమ తవ్వకాలు - వెలికి తీసిన క్వార్ట్జ్ ఖనిజం

గూడూరు అర్బన్, మార్చి 17: పచ్చని పొలాలపై క్వార్ట్జ్ మాఫియా పంజా విసురుతోంది. నిమ్మ, మామిడి, తదితర ఉద్యాన పంటలున్న భూముల్లో అక్రమ తవ్వకాలతో ఖనిజ సంపదను దోచేస్తోంది. అధికారం అండతో చెలరేగిపోతోంది. దీనివల్ల రైతులకూ తీరని నష్టం కల్గిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా అంటే నిమ్మపంట సాగుకు పెట్టింది పేరు. నిత్యం 200 నుంచి వెయ్యి టన్నుల వరకు నిమ్మకాయలను దేశం నలుమూలలకే కాక విదేశాలకు సైతం ఎగుమతి అవుతూ, వేలాది రైతు కుటుంబాలకు కడుపునింపుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీరి జీవన చిత్రం ప్రమాదంలో పడింది. సాగులో ఉన్న నిమ్మ, మామిడి భూముల్లో క్వార్ట్జ్ ఖనిజం విస్తారంగా నిక్షిప్తమై ఉందని తెలియడంతో అక్రమార్కుల కన్ను ఈ పచ్చని పొలాలపై పడింది. ఇంకేముంది రైతులకు డబ్బు ఆశచూపడం.. ఒప్పుకోని వారిని బెదిరించి మరీ భూములను లాక్కొని ఖనిజాన్ని కొల్లగొట్టడం నిత్యకృత్యమైంది.

సమీప బీడు భూములకు లైసెన్సు

పంట భూముల్లో అక్రమంగా వెలికితీసిన క్వార్ట్జ్ ఖనిజాన్ని మైనింగ్ డీలర్స్ లైసెన్స్ (ఎండీఎల్) తీసుకుని సమీప బీడు భూముల్లో నిల్వ చేస్తారు. ఆ తర్వాత గ్రేడింగ్ చేసుకుని చెన్నైకి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. రవాణాకు అవసరమయ్యే రాయల్టీ టాన్సిస్ (పర్మిట్) కూడా మైనింగ్‌శాఖ నుంచి, అనుమతులు పొందిన గనుల నుంచి ఈ ఘనులు సులభంగా సమకూర్చుకుంటున్నారు.


మైనింగ్ శాఖకంటే జే, ఏ ట్యాక్స్ చెల్లిస్తే చాలు

మైనింగ్ శాఖకు నామమాత్రంగా రాయల్టీ చెల్లిస్తే చాలు. ఇక జే ట్యాక్స్, ఏ ట్యాక్స్ అనే పేర్లతో టన్నుకు రూ.7వేల వరకు అధికార పార్టీ పెద్దలు నియమించుకున్న అనుచరులకు కట్టాలి. ఆ తర్వాత తమ వాహనాలకు అనుమతి లభించే స్థాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, సైదాపురం, బాలాయపల్లి, వెంకటగిరి, పొదలకూరు మండలాల నుంచే నిత్యం 150కిపైగా భారీ వాహనాల్లో ఐదువేల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ ఖనిజం చెన్నైకి, అక్కడినుంచి భారీ ఓడల్లో చైనా, జపాన్, సింగపూర్, మరికొన్ని అరబ్ దేశాలకు ఎగుమతి అవుతుందంటే అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మిన్నకుండి పోతున్న అధికారులు

వైసీపీ పెద్దలకు భయపడి ఇటు మైనింగ్‌శాఖ నుంచి ఏ మాత్రం చర్యలు కనిపించకపోవడంతో రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్, సెబ్, ఫారెస్ట్ శాఖలు కూడా మిన్నకుండి పోతున్నాయి. ఇకనైనా ఈ అక్రమ దందాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ



డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, మార్చి 17: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నిక కోడ్ అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలకు సంబంధించి ర్యాలీలు, బహిరంగసభలు ఏర్పాటు చేయాలంటే ఖచ్చితంగా పోలీసు, ఆర్వో అనుమతులు ఉండాలన్నారు. ప్రచార వాహనాలు, బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల దృష్ట్యా డివిజన్ పరిధిలో పాత కేసుల్లో 2139 మంది నిందితులు, 81మంది రౌడీషీటర్లపై బెండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, బెదిరింపులకు దిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రాంభం కానుండడంతో డివిజన్ పరిధిలోని 31 కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు పరుస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

వేనాటి నిర్ణయం బాధాకరం: నెలవల

సూళ్లూరుపేట, మార్చి 17: టీడీపీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి పార్టీలో ప్రాధాన్యం ఇవ్వలేదని మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం బాధాకరమని, తన నిర్ణయాన్ని ఆయన పునరాలోచించుకోవాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూళ్లూరుపేటలో వేనాటి కుటుంబానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. వేనాటి కుటుంబం చెప్పిన పరసా వెంకటరత్నంకు వరుసగా ఆరుసార్లు టికెట్ ఇచ్చిన విషయం గుర్తుచేశారు. వివిధ సర్వేల ఆధారంగానే తన కుమార్తె నెలవల విజయశ్రీకి టికెట్ కేటాయించారని చెప్పారు. తాను కూడా వేనాటిని అనేకసార్లు కలిసి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. వేనాటి నిర్ణయం పార్టీలో అందరికీ బాధ కలిగించదని, ఆయన తన నిర్ణయాన్ని మార్చుకుని టీడీపీ విజయానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, బొమ్మన పళని, మెలచాం సుదర్శన్ రావు, పూడి శెల్వం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు





ప్రజాగళం సభకు తరలివెళుతున్న మాజీ ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

గూడూరు, మార్చి 17: ప్రధాని మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధిపతి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో చిలకలూరుపేట నియోజకవర్గంలోని బొప్పాడిలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నేతృత్వంలో టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఇందులో ఇందులో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

చిల్లకూరు: మండలం నుంచి టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, రామ్మూర్తి, మల్లికార్జున్, వినోద్, సురేష్‌బాబు, మధు, నవీన్, జగన్, శ్రీనివాసులు తదితరులు ప్రజాగళం బహిరంగ సభకు తరలివెళ్లారు.

వెంకటగిరి: మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ప్రజాగళం సభకు తరలివెళ్లారు. ఇందులో పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళి రెడ్డి, గంగాధర్, చలపతి, మల్లపు బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, సుధా, నరిసింహులు ఉన్నారు.

కోట: మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పలు వాహనాలలో చిలకలూరిపేటకు తరలివెళ్లారు. ఎస్సీ సెల్ నాయకులు మురళి, యల్లశిరి కృష్ణయ్య, వేణు, అనూక్, రవి తదితరులు వెళ్లారు.

తడ: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం బహిరంగసభకు తడ నుంచి తెలుగుతమ్ముళ్లు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు బొమ్మన పళణి, జయపాల్, ఏకాంబరం, రవి, సెల్వం, తదితరులు ఉన్నారు.

ఓజిలి: టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఓజిలి నుంచి రెండు బస్సులు, 15 కార్లలో చిలకలూరిపేట సభకు తరలివెళ్ళారు. విజయకుమార్‌నాయుడు, పాడి వెంకటసుబ్బయ్య, నాయకులు మైలాం జయచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

సూళ్లూరుపేట: టీడీపీ నాయకులు నాపా మునిరాజా, గురుకల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్యకర్తలు స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు తరలివెళ్లారు. గురుకల కృష్ణయ్య, సామంతమల్లాం సుబ్రమణ్యం, జనార్ధన్ తదితరులుఉన్నారు.

నాయుడుపేట: మండల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రజాగళం బహిరంగసభకు తరలివెళ్లారు.

టీడీపీ నేత కొండేపాటికి సన్మానం



గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 17: ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌ను ఆ పార్టీ నాయకులు సన్మానించారు. ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు గంగాప్రసాద్‌ను ఆదివారం ఆయన ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో వైసీపీ యువ నాయకులు ఎస్‌కే.ఆలీబాయ్, దాసరి శశిధర్ తదితరులు కొండేపాటి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, మేడా సాయి నారాయణ, పెంచలయ్య, బుజ్జిబాబు, బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుతో మంచి సమాజం



ఓటు హక్కు అవగాహన ర్యాలీ చేస్తున్న పట్టణ ప్రముఖులు

నాయుడుపేట, మార్చి 17: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి సమాజం నిర్మించుకుందామని సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపి అన్నారు. నాయుడుపేటలోని కళాశాల నుంచి పట్టణ ప్రముఖులతో కలసి ఓటుహక్కు విలువను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవడం అంటే ఆత్మాభిమానం చంపుకోవడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, న్యాయవాదులు చదలవాడ కుమార్, పసల గంగాప్రసాద్, కిషోర్, ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, కందనూరు సంజాయ్, మనోజ్, మధు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గూడూరు అర్బన్, మార్చి 17: పట్టణంలో ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులు మానవత్వం చాటుకున్నారు. స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వుంటున్న కృష్ణమూర్తి(80) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వృద్ధాశ్రమ నిర్వాహకురాలు కల్యాణి మెగా బ్రదర్స్ సేవాసమితికి సమాచారం ఇచ్చారు. మృతుడికి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించామని సమితి నాయకుడు తీగల చంద్రశేఖర్ చెప్పారు. కార్యక్రమంలో ఓంకార్, సూర్య, మోహన్, శంకర్, సనత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

నాయుడుపేట టౌన్, మార్చి 17: దుకాణాల్లో తూకాలు తక్కువగా ఉన్నా, ఎలక్ట్రానిక్ మిషన్‌ల వినియోగంలో నిబంధనలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ సీఐ మల్లేశ్వర్ హెచ్చరించారు. పట్టణంలోని మాంసం, కూరగాయాల మార్కెట్లలో దుకాణాలను ఆదివారం సీఐ తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ కాటాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తూకం తక్కువగా ఉండి, అధిక ధరలకు అమ్మకాలు జరుపుతూ మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సుమంత్‌కు ఇంటీరియర్ డిజైనర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుమంత్

వెంకటగిరిటౌన్, మార్చి 17: వెంకటగిరి పట్టణానికి చెందిన నక్కా సుమంత్ 'బ్లైండ్ వింక్' సంస్థ ఉత్తమ ఇండియా ఆర్కిటెక్, ఇంటీరియర్ డిజైన్ అవార్డు అందజేసింది. ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్ చైర్మన్ కృష్ణారావు జైసిం, సినీ నటి అమిత రావు చేతుల మీదుగా అందుకున్నారు.

దేశపురోభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

తిరుపతి(రూరల్), మార్చి 17: దేశపురోభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్‌ఆర్‌జోషి పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం వికసిత భారత్-2047 ఇంట్రాక్షన్ విత్ యూత్ అండ్ మోటివేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువత తమ సలహాలు, సూచనలు తెలియపరచి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని దేశవికాసం, సంస్కృతి సంరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత ద్వారా దేశవికాసం జరుగుతుందని తెలిపారు. యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ శాలిని, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, కంప్యూటర్ సైన్స్ హెడ్ ప్రొఫెసర్ చంద్రశేఖరం పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

సూళ్లూరుపేట, మార్చి 17: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి గూడూరుకు చెందిన ఏ.శెల్వం కుటుంబ సభ్యులు రూ.50వేలు ఆదివారం అందజేశారు. సహాయ కమిషనర్ డి.వెంకటేశ్వర్లుకు నగదు అందజేశారు.

ప్రజాసంఘాల ఐక్యవేదిక అభ్యర్థులను గెలిపించండి

గూడూరు అర్బన్, మార్చి 17: ప్రజాసంఘాల ఐక్యవేదిక తరఫున తిరుపతి పార్లమెంటు అభ్యర్థిగా మునెయ్య, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా చిరంజీవి పోటీ చేస్తున్న తమను గెలిపించాలని ఆ అభ్యర్థులు కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ పొందేలా కృషి చేస్తామన్నారు. తమను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠానికి ఉచితంగా బస్సు

వెంకటగిరిటౌన్, మార్చి 17: స్వామి వివేకానందా యువ సైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతి కుమార్ బ్రహ్మంగారి మఠానికి ఉచితంగా బస్సు ఏర్పాటు చేశారు. ఆదివారం 60మంది యాత్రికులను తీసుకెళ్లి బ్రహ్మంగారి మఠం, పెంచలకోన క్షేత్రాలకు తీసుకెళ్లారు.

ఆటోనగర్ అసోసియేషన్ సమావేశం

గూడూరు అర్బన్, మార్చి 17: స్థానిక ఆటోనగర్, ఆటోమొబైల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఆటోనగర్‌లో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల పతిభ

తిరుపతి(క్రీడలు), మార్చి 17: రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఎంజీఎం హైస్కూల్‌కు చెందిన వి.జ్యోత్స్న(కాంస్యం), కె.నిరంజన్(వెండి) పతకాలు సాధించారు. ఆదివారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వీరిని జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మైప్రవీణ్, కార్యదర్శి ఆర్.శ్రీధర్ అభినందించారు.

విగ్రహాలకు ముసుగులు.. ఫ్లెక్సీల తొలగింపు

గూడూరు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పట్టణంలో రాజకీయ నేతల విగ్రహాలకు ఆదివారం మున్సిపల్ సిబ్బంది ముగుసులు తొడిగారు. వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసివున్న ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఫ్లెక్సీలను తహసీల్దారు నాగరాజరావు, ఎంపీడీవో శంకరయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఆదివారం తొలగించారు. అలాగే ప్రభుత్వకార్యాలయాలు, బస్టాండ్‌లు, సచివాలయాలు, ఆర్‌బీకేలలో ఉన్న అధికార పార్టీ సంక్షేమ పథకాలకు సంబంధించిన క్యాలెండర్లు, సీఎం జగన్ ఫోటోలను తొలగించారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు.

చిట్టమూరు: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిబంధనల అమలుకు అధికారులు చర్యలు మొదలు పెట్టారు. తహసీల్దార్ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో అధికారులు రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయించి, ఫ్లెక్సీలను తొలగించారు. కొత్తగుంట, మల్లాం, తాడిమేడు, మెట్టు, గునపాడు గ్రామాల్లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఎస్ఐ చిన్న బలరామయ్య, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మార్చి 7: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానం

గూడూరు, మార్చి 17: స్థానిక అడవయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో ఆదివారం కృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కూరపాటి రవీంద్రబాబు, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.